

శ్రీమఠంలో జిల్లా జడ్జి

మంత్రాలయం: కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావు గురువారం మంత్రాలయం వచ్చారు. రాఘవేంద్రుల మూల బృందావనం చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.



శాస్త్రోక్తంగా ఊయల సేవ

శ్రీశైలం: పౌర్ణమి సందర్భంగా గురువారం శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామికి శాస్త్రోక్తంగా ఊయల సేవ నిర్వహించారు. భ్రమరాంబ దేవికి లక్ష కుంకుమార్చన చేశారు.



మహానంది కిటకిట

మహానంది: మహానందీశ్వర ఆలయం గురువారం వేలాది మంది భక్తులతో కిటకిటలాడింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

న్యూస్‌రీల్

కనుల పండువగా మల్లన్న గిరిప్రదక్షిణ



పల్లకీలో ఉత్సవమూర్తులను గిరి ప్రదక్షిణకు తీసుకెళ్తున్న వేదపండితులు

శ్రీశైలం: వైశాఖ శుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని గురువారం సాయంత్రం శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల శ్రీశైల గిరి ప్రదక్షిణ కనుల పండవగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకీలో వేయింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత ఆలయ ప్రాంగణం నుంచి నందిమండపం, అంకాలమ్మ గుడి, అలంకారేశ్వర స్వామి గుడి, బయలు వీరభద్ర స్వామి ఆలయం వరకు ఊరేగింపు సాగింది. అక్కడి నుంచి సారంగధర మఠం, మల్లమ్మ ఆలయం చేరుకుంది. అనంతరం మహిషాసురమర్దిని రుద్రా పార్కు, నంది మండపం నుంచి ఆలయ ప్రాంగణం చేరుకుంది. వందలాది మంది భక్తులు అర్చక స్వాములు, ఆగమ పాఠశాల విద్యార్థులు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు.

ఆయుర్వేద ఆసుపత్రులకు మందులు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలోని ఆయుర్వేద ఆసుపత్రులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున మందులను సరఫరా చేస్తోంది. ప్రతి డిస్పెన్సరీకి అక్కడి డిమాండ్, వారు పెట్టిన ఇండెంట్‌కు మించి అందజేస్తోంది. ఒక్క కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఆయుర్వేద డిస్పెన్సరికే రూ.36లక్షల విలువైన మందులను సరఫరా చేశారు. వచ్చిన మందులను స్టోర్ చేసుకునేందుకు స్థలం చాలక వైద్యులు, సిబ్బంది పక్కనే గుట్టలుగా పేర్చాల్సి వచ్చింది. మొత్తం 120 రకాల మందులను ఇక్కడ అందుబాటులో ఉంచారు.

డ్రగ్ కంట్రోల్ ఏడీ రమాదేవి సస్పెన్షన్

కర్నూలు(హాస్పిటల్): ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రమాదేవి సస్పెండ్ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో విధులకు ఆమె గైర్హాజరు కావడంతో చర్యలు తీసుకోవాలని ఆ శాఖ డీజీ రఘురామిరెడ్డికి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సిఫారసు చేశారు. జిల్లా అధికారిగా ఉండి ఎన్నికల విధులకు గైర్హాజరు కావడం సరికాదంటూ ఏడీ రమాదేవిని డీజీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లా ట్రెజరీలో పోస్టల్ బ్యాలెట్‌లు భద్రం

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్‌లు జిల్లా ట్రెజరీలో భద్రంగా, సురక్షితంగా ఉన్నాయని జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ డాక్టర్ జి.సృజన గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఉంచిన ప్రదేశాల్లో సీసీ కెమెరాలతో పాటు డబుల్ లాక్ సిస్టమ్ కూడా ఉందన్నారు. 24 గంటలు ఆర్మ్‌డ్ గార్డు పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు ఏర్పాటైందన్నారు. ఎవరైనా అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు భద్రత అంశాన్ని పరిశీలించుకోవాలనుకుంటే జిల్లా ట్రెజరీని సందర్శించి సీసీ కెమెరాల ఫీడ్ చూసుకోవచ్చని పేర్కొన్నారు.

'విభిన్న' విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం

కర్నూలు(అర్బన్): సీ క్యాంప్‌లోని ప్రభుత్వ శారీరక వికలాంగుల వసతి గృహంలో ప్రవేశం పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్‌ఫాతిమా గురువారం ఒక ప్రకటనలో కోరారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ వసతి గృహంలో 100 మంది విద్యార్థులకు వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. 3వ తరగతి నుంచి ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ తదితర కోర్సులు చదువుతున్న విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 8639152178, 08518-277864ను సంప్రదించాలన్నారు.

హస్తినకు ఆళ్లగడ్డ బొప్పాయి

- బొప్పాయి తోటల సాగుపై రైతుల ఆసక్తి
- ఉద్యాన శాఖ రాయితీలు సద్వినియోగం
- సుమారు 2,500 ఎకరాల్లో సాగు
- ఏడాది పొడువునా ఆదాయం
- అంతర పంటలతోనూ అధిక ఆదాయం
- ప్రస్తుతం టన్ను రూ. 14 వేలు

సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్న జిల్లాలో వరితో పాటు వాణిజ్య, ఉద్యాన పంటలు సాగు చేయడంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే పసుపు, అరటి, నిమ్మ, శనగ, సీడు పత్తి సాగులో ప్రత్యేక గుర్తింపు ఉండగా ఈ క్రమంలోనే ఆళ్లగడ్డ నియోజకవర్గంలో బొప్పాయి సాగు విస్తీర్ణం ఏటేటా పెరుగుతోంది. ఓ వైపు ప్రభుత్వం ప్రోత్సహిస్తుండటం.. మరో వైపు రాయితీలు, సాగుపై అధికారులు అవగాహన కల్పిస్తుండటం.. ఇదే సమయంలో పంటకు మంచి ధర పలుకుతుండటంతో రైతులు బొప్పాయిని సాగు చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసి లాభాలు ఆర్జిస్తున్నారు.



ఎగుమతి చేసేందుకు కాయలను ప్రత్యేకంగా ప్యాంకింగ్ చేస్తున్న కూలీలు



లారీ లోపల నలువైపుల ఎండు వరిగడ్డి నింపి బొప్పాయిని లోడింగ్ చేసిన దృశ్యం

ఆళ్లగడ్డ: బొప్పాయి సాగు రైతుల పాలిట కల్పతరువుగా మారింది. జిల్లాలోని 11 మండలాల పరిధిలో సుమారు 2,500 ఎకరాల్లో ఈ పంట సాగవుతోందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఒక్క ఆళ్లగడ్డ పరిసర ప్రాంతాల్లోనే సుమారు 2 వేల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. వాస్తవానికి రెండేళ్ల కాలపరిమితి ఉన్న బొప్పాయి పంట ఆధునిక పద్ధతుల్లో సాగు చేస్తుండటంతో 7 నుంచి 8 నెలల లోపే తొలి కాపునకు వస్తోంది. నాటిన 5 నెలలకు పూత ప్రారంభమై ఆరో నెల నుంచి పిందె మొదలై 7 నెల నుంచి 8వ నెలకు కోత ప్రారంభమవుతుంది. వారం, పది రోజులకు ఒక కోత చొప్పున వస్తుంది. దీంతో ఖర్చు కొంత మేర ఎక్కువైనా కచ్చితమైన లాభాలు వస్తుండటంతో అధిక శాతం మంది బొప్పాయి సాగు వైపు ఆసక్తి చూపుతున్నారు. ఎకరా బొప్పాయి సాగుకు రూ. 70 వేలు ఖర్చు అవుతుంది. కలుపు రాకుండా మల్చింగ్ షీట్ల ఏర్పాటు, డ్రిప్ ఇరిగేషన్ తదితర ఆధునిక పద్ధతులతో సాగు చేస్తే రూ. లక్ష దాక ఖర్చు అవుతుంది. మొక్కలు నాటిన 7 నెలల నుంచి తొలి కాపు చేతి కందుతుంది. తొలి కాపులో ఒక టన్ను నుంచి 1.5 టన్నుల దిగుబడి.. 20 రోజుల అనంతరం రెండో కాపులో రెండు నుంచి మూడు టన్నులు.. మూడో కాపులో నాలుగు నుంచి ఐదు టన్నులు ఇలా వారం, పది రోజులకు ఒక కోత చొప్పున దిగుబడి వస్తుంది. ఇలా రెండేళ్లు చొప్పున ఏడాదికి 40 టన్నుల దిగుబడి వస్తున్నట్లు రైతులు తెలుపుతున్నారు. ఈ లెక్కన ఏడాదికి ఖర్చులు అన్నీ పోను రూ. 3.5 లక్షలకుపైగా ఆదాయం గడిస్తున్నారు. ఇక్కడ బొప్పాయికి ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. సీజన్‌లో చాగలమర్రి కేంద్రంగా చేసుకుని ఢిల్లీ, రాజస్థాన్, పంజాబ్, మధ్యప్రదేశ్, ముంబై తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు జిల్లాలోని తోటల దగ్గరకొచ్చి కాయలను కొనుగోలు చేసి వారి రాష్ట్రాలకు తరలిస్తున్నారు.

జిల్లాలో బొప్పాయి సాగు వివరాలు

బొప్పాయి తోటలు	ఎకరాకు దిగుబడి	కోత వ్యవధి కాలం
2,500 ఎకరాలు	30 - 40 టన్నులు	10 - 15 రోజులు
ఒక కోతకు వచ్చే కాయలు	**ఒక లారికీ చేసే లోడింగ్**	**సీజన్‌లో రోజు ఎగుమతి**
3 - 3.5 టన్నులు	15 - 17 టన్నులు	60 - 90 టన్నులు

రాయితీలు భళా.. !

రాష్ట్ర ప్రభుత్వం వాణిజ్య పంట అయిన బొప్పాయి సాగుపై రైతుల్లో ఆసక్తి కల్పించి సాగు విస్తీర్ణం పెంచేందుకు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం పేరుతో సబ్సిడీ అందిస్తోంది. హెక్టార్ విస్తీర్ణంలో పంట సాగుకు (నర్సరీ నుంచి మొక్కలు కొనుగోలు, ఎరువులు, పురుగు మందులు తదితర వాటికి) రూ. 18 వేలు పెట్టుబడి సాయం చేస్తుంది. దీంతో పాటు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు రూ. 72,848 కాగా వాటిని రూ.7,284కు, అలాగే 50 శాతం రాయితీతో మల్చింగ్ షీట్‌లు అందిస్తోంది.

8 నెలలు ఇక్కడే మకాం

బొప్పాయి ఎగుమతి చేయడం కోసం వ్యాపారులు, ఏజెంట్లు సుమారు 8 నెలలు పాటు చాగలమర్రిలో మకాం వేస్తారు. ముంబై, రాజస్థాన్‌కు తరలించే బొప్పాయిల కంటే ఢిల్లీ అటు నుంచి ఇతర దేశాలకు ఎగుమతి చేసే కాయల కోత, ప్యాకింగ్ అంతా ప్రత్యేకంగా ఉంటుంది. ఈ కాయల కోత, ప్యాకింగ్ కోసం బిహార్, జార్ఖండ్ ప్రాంతాలకు చెందిన నేర్పుగల కూలీలను వ్యాపారులు ఇక్కడికి తీసుకొస్తుంటారు. ముందు ఎండు వరి గడ్డితో లారీని లోపలంతా ఒక క్రమ పద్ధతిలో ప్యాకింగ్ చేస్తారు. ఇతర ప్రాంతాలకు బొప్పాయి సగం రంగు వచ్చేవరకు కోయరు. అయితే ఢిల్లీ కటింగ్‌కు పచ్చిగా ఉండాలి. వారం నుంచి పది రోజుల తరువాత వర్ణం (మాగడం) వచ్చే కాయలను మాత్రమే ఏరిమరీ కోయడం జరుగుతుంది. పైగా చెట్టుపై నుంచి కటింగ్ చేసిన ఒక్క కాయ కూడా నేల మీద పడకుండా జాగ్రత్తగా కిందకు దించి పేపర్‌లో ప్యాక్ చేస్తారు.

ఈ ఏడాది అత్యధిక ధరలు..

గత 2, 3 ఏళ్లుగా ఆశించిన స్థాయిలో దిగుబడి రాక.. అనుకున్నంత సరైన ధరలు లేక రైతులు డీలా పడ్డారు. ఈ ఏడాది బొప్పాయి ధరలు మార్కెట్లో బాగా పుంజుకున్నాయి. టన్ను రూ. 14 నుంచి రూ. 16 వేలకు ధర పలుకుతుండటం విశేషం. ఈ రెండు, మూడేళ్లలో ఇవే అత్యధిక ధరలని రైతులు అంటున్నారు. మార్కెట్లో ధర ఇలాగే నిలబడితే తమ పంట పండినట్లేనని బొప్పాయి రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

లాభాలు బాగున్నాయి



నేను ఆరేళ్లుగా బొప్పాయి సాగు చేస్తున్నాను. ఈ ఏడాది కూడా 2.5 ఎకరాల్లో సాగు చేశా. పెట్టుబడి రూ. 1.5 లక్షల దాక వచ్చింది. బొప్పాయి కాయలు అమ్మగా ఇప్పటికి సుమారు రూ. 7 లక్షల దాక వచ్చింది. ఇంకా కాయలు ఉన్నాయి. గత మూడేళ్లుగా బొప్పాయి సాగుతో దెబ్బతిన్నాం. ఈ ఏడాది ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఆ నష్టాల నుంచి గట్టెక్కుతామని అనుకుంటున్నాం.
– రమేష్, అలమూరు

తోటల వద్దే కొనుగోలు చేస్తున్నారు



వ్యాపారులు తోటల దగ్గరకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. బయటి రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు ముందే ధర నిర్ణయించి బేరం మాట్లాడుతారు. ఈ సీజన్‌లో నేను ఐదు ఎకరాల్లో బొప్పాయి సాగు చేశాను. కూలీల ఖర్చు, మార్కెట్‌కు తరలించడం వంటి అన్ని ఖర్చులు వ్యాపారులే భరిస్తారు. మా తోటను చూసి పలువురు రైతులు సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది.
– లక్ష్మీరెడ్డి, చిన్నవంగలి

జాగ్రత్తలు తప్పనిసరి



జిల్లాలో బొప్పాయి సాగు విస్తారంగా పెరుగుతోంది. రైతుల కూడా మంచి ఆదాయం పొందుతున్నారు. అయితే బొప్పాయి సాగులో బ్యాక్టీరియా, వైరస్ తెగుళ్లపై రైతులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. పెట్టుబడి సాయం రూ. 18 వేలతోపాటు 90 శాతం రాయితీపై డ్రిప్, 50 శాతం రాయితీపై మల్చింగ్ షీట్ పరికరాలను అందజేయడం జరుగుతుంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.
– యు. నాగరాజు, జిల్లా ఉద్యానశాఖాధికారి

వైభవోపేతం.. గరుడోత్సవం



గరుడ వాహనంపై కొలువై భక్తులకు దర్శనమిస్తున్న జ్వాలా నరసింహస్వామి



దిగువ అహోబిలంలో పుష్ప పల్లకీలో విహరిస్తున్న ఉత్సవ మూర్తులు

ఆళ్లగడ్డ: అహోబిల నరసింహస్వామి జయంతి బ్రహ్మోత్సవాల సందర్భంగా చివరి రోజు గురువారం జ్వాలా నరసింహస్వామి గరుడోత్సవాన్ని అంగరంగ వైభవోపేతంగా నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి నిత్య పూజల అనంతరం ఉత్సవమూర్తులైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జ్వాలా నరసింహస్వాములను ప్రత్యేకంగా అలంకరించి కొలువుంచి బ్రహ్మోత్సవ పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ జ్వాలా నరసింహస్వామిని ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై ఉంచి ఆస్థాన విద్వాంసుల మంగళకరమైన వాయిద్యాలు, వేద పండితుల వేదోక్త మంత్ర పఠనములు.. భక్తుల గోవింద నామస్మరణల నడుమ విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన సందర్భంగా శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం చేపట్టారు. దిగువ అహోబిలంలో శ్రీ ప్రహ్లాదవరదస్వామి ఉభయ దేవేరులతో విశేషంగా అలంకరించిన పుష్ప పల్లకీలో కొలువై భక్తులకు కనువిందు చేశారు.

కనుల పండువగా పుష్పయాగం..

జ్వాలా నరసింహుడు దేవేరీ మహాలక్ష్మి పుష్పయాగం వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జ్వాలా నరసింహస్వామిని యాగశాలలో కొలువుంచి ముందుగా అభిషేకం, అర్చనలు నవకళశస్నపన, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను వివిధ ప్రదేశాల నుంచి తెప్పించిన 108 రకాల పూలు, పత్రాలతో అలంకరించిన యాగశాలలో కొలువుంచారు. అనంతరం విడి పూలతో స్వామి, అమ్మవార్ల పాదాల నుంచి హృదయం మునిగేంత వరకు పుష్పారాధన నిర్వహించారు. తరువాత ధూపదీప నీరాజనాలు సమర్పించి పుష్పాలను పూర్తిగా తొలగించడం ఇలా ఇరవైసార్లు సుమధుర సుగంధాలు విరజిమ్మే పుష్పాలతో ఈ పుష్ప కైంకర్యం సుమారు ఐదు గంటల పాటు కనుల పండువగా నిర్వహించారు.

చెన్నకేశవా.. పాహిమాం

రథోత్సవాన్ని తిలకిస్తున్న భక్తజనం



మిడుతూరు: మండల కేంద్రమైన మిడుతూరులో వెలసిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి రథోత్సవం అశేష జనవాహిని మధ్య అంగరంగ వైభవంగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వార్ల రథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం ఆలయంలో వేద పండితులు సుబ్రమణ్యం శర్మ, ఆలయ అర్చకులు వెంకట్రామయ్య ఆధ్వర్యంలో రథాంగ హోమం నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి, అమ్మ వార్ల ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా పూజాధికాలు నిర్వహించిన అనంతరం పల్లకీలో ఆశీనులు గావించారు. అనంతరం మేళ తాళాలు, బాజా భజంత్రీలతో రథం వద్దకు తీసుకవచ్చి, రథం చుట్టూ ప్రదక్షిణల అనంతరం రథంపై కొలువుంచి రథాంగ పూజలు చేశారు. అనంతరం గ్రామ పురవీధుల మీదుగా రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు గోవింద నామ స్మరణతో రథాన్ని ముందుకు లాగారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నందికొట్కూరు రూరల్, పట్టణ సీఐలు విజయ భాస్కర్, ప్రకాష్ బాబు, ఎస్ఐ జగన్ మోహన్ ఆధ్వర్యంలో గట్టి బందొబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తులశమ్మ, ఆలయ ఈఓ ఏడీ వెంకటరమణ, జూపాడుబంగ్లా, ముచ్చుమర్రి ఎస్ఐలు లక్ష్మీనారాయణ, విజయశేఖర్ పాల్గొన్నారు.



పల్లకీపై ఉత్సవమూర్తులను రథం వద్దకు తీసుకెళ్తున్న భక్తులు

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు

నంద్యాల: సాధారణ ఎన్నికలు – 2024లో భాగంగా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా సిద్ధం చేస్తున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు తెలిపారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై మీడియా ద్వారా వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్జీఎం, శాంతిరాం ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లోని ఈవీఎంలకు మూడు అంచెల భద్రత కల్పించామన్నారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు/ఎలక్షన్ ఏజెంట్ పాసుల జారీ నిమిత్తం ఈనెల 27వ తేదీలోగా వివరాలు ఇవ్వాలని రాజకీయ పార్టీలకు తెలిపామన్నారు. జూన్ 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, నలుగురుకు మించి వ్యక్తులు ఎవరు గుమికూడి ఉండరాదన్నారు. ఎలాంటి ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. బాణసంచా సామగ్రి విక్రయాలను కూడా నిషేధించామన్నారు.

నేటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

నంద్యాల (న్యూటౌన్): పాలీసెట్-2024లో అర్హత సాధించిన విద్యార్థులకు శుక్రవారం నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుందని స్థానిక పాలిటెక్నిక్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జూన్ 2వ తేదీ వరకు ఆన్‌లైన్‌లైన్‌లో https://appolycet.nic.inలో ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700 ప్రకారం ఫీజులు చెల్లించాలని తెలిపారు. ఫీజు చెల్లించిన విద్యార్థుల విద్యార్హత ధ్రువ పత్రాల పరిశీలన ఈ నెల 27 నుంచి జూన్ 3వ తేదీ వరకు ఉంటుందని, 31 నుంచి జూన్ 5వ తేదీ వరకు కాలేజీ ఆప్షన్స్ ఇచ్చుకోవచ్చునని పేర్కొన్నారు. జూన్ 5న ఆప్షన్ మార్చుకునే అవకాశం ఉంటుందని, జూన్7న కాలేజీలను కేటాయిస్తారని తెలిపారు. జూన్ 10వ తేదీ నుంచి కళాశాలలో తరగతులు ప్రారంభమవుతాయన్నారు. స్పెషల్ క్యాటగిరీ(ఎన్‌సీసీ, పీహెచ్, క్యాప్, స్పోర్ట్స్)లకు వారికి షెడ్యూల్ ప్రకారం విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. వివరాలకు 9912377723ను సంప్రదించాలన్నారు.

విద్యార్హత ధ్రువ పత్రాల పరిశీలన ఇలా..

తేదీ	ర్యాంకులు
27	1 నుంచి 12 వేలు
28	12,001 నుంచి 27 వేలు
29	27,001 నుంచి 43 వేలు
30	43,001 నుంచి 59 వేలు
31	59,001 నుంచి 75 వేలు
జూన్1	75,001 నుంచి 92 వేలు
జూన్2	92,001 నుంచి 1,08,000
జూన్3	1,08,001 నుంచి చివరి ర్యాంకు వరకు

'రండి మా కాలేజీకి'

- ప్రభుత్వ కళాశాల సిబ్బంది ఇంటింటి ప్రచారం

గోస్పాడు/కోవెలకుంట్ల: 'రండి.. మా కళాశాలలో చేరండి. మెరుగైన వసతులు.. అనుభవం ఉన్న అధ్యాపకులు.. అన్నీ ఉచితం' అంటూ ఇంటింటి ప్రచారం చేస్తున్నారు ప్రభుత్వ జూనియర్ కళాశాలల సిబ్బంది. కార్పొరేట్ కళాశాలల తరహాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న కోర్సులు, సీట్లు, ప్రత్యేకతలు, గత ఫలితాలను వివరిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ మేరకు గురువారం గోస్పాడు జూనియర్ కళాశాల అధ్యాపకులు ఎం.చింత కుంట్ల, జూలేపల్లె, పసురపాడు, గోస్పాడు గ్రామాల్లో గురువారం ఇంటింటికీ తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ హుసేన్‌సా, అధ్యాపకులు హాజీవలి, రమేష్‌తో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే కోవెలకుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు విజయరావు, ప్రేమ్‌చంద్, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, శ్రీదేవి, పుష్పమ్మ, శివమ్మ, స్వప్న తదితరులు గురువారం కోవెలకుంట్ల పట్టణంతోపాటు సంజామల మండలం ముదిగేడు, ముక్కమల్ల, ఆకుమల్ల గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. పదవ తరగతి పాసైన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి తమ కళాశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు.



ఎం.చింతకుంటలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గోస్పాడు కళాశాల అధ్యాపకులు

ఐదు లక్షల మందికి బీసీజీ వ్యాక్సినేషన్



బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న రామనాథరావు, చిత్రంలో డీఎంహెచ్ఓ వెంకటరమణ

చాగలమర్రి: జిల్లాలో 5 లక్షల మందికి బీసీజీ వ్యాక్సినేషన్ వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్, నంద్యాల జిల్లా అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ నోడల్ అధికారి రామనాథరావు, జిల్లా డీఎంహెచ్ఓ వెంకటరమణ అన్నారు. ఆయన గురువారం మండల కేంద్రమైన చాగలమర్రిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే పాత ఎస్సీ కాలనీలోని 8వ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన బీసీజీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 నుంచి 60 సంవత్సరాలు పైబడిన వారికి ప్రతి గురువారం బీసీజీ టీకా వేయడం జరుగుతుందన్నారు. షుగర్, టీబీ, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు సంక్రమించకుండా ముందస్తుగా వాక్సిన్ వేస్తున్నామని, దీని వల్ల ఎటువంటి దుష్పరిణామాలు ఉండవన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో మందుల కొరత లేదని, పాము కాటు వేసే యాంటి స్నేక్ వీనమ్ కూడా అందుబాటులో ఉందన్నారు. వారి వెంట జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ప్రసన్నలక్ష్మి, జిల్లా మలేరియా నివారణాధికారి వరప్రసాద్‌రెడ్డి, స్థానిక వైద్యాధికారి షేక్.ఇమ్రాన్, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, సిబ్బంది నాయక్, ఫార్మాసిస్ట్ రాజేష్, సి.లక్ష్మీదేవి, సీహెచ్ గార్లెట్, సురేంద్రబాబు, చంద్రశేఖర్ ఉన్నారు.

క్లుప్తంగా

యువకుడిపై పోక్సో కేసు

పత్తికొండ రూరల్ : పత్తికొండలోని ఓ బాలికను లైంగికంగా వేధిస్తున్న సుధాకర్ అనే యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ మురళీమోహన్ గురువారం తెలిపారు. సుధాకర్ కొద్దిరోజులుగా బాలికకు మాయమాటలు చెప్పి ఫొటోలు తీసుకున్నాడు. ఫొటోలను ఫేస్‌బుక్, వాట్సాప్ సోషల్ మీడియాలో పోస్టు చేస్తామని బెదిరిస్తూ బ్లాక్ మెయిల్ చేసి వేలాది రూపాయల డబ్బులు లాక్కున్నాడు. ఇంకా డబ్బులు కావాలని వేధిస్తుండడంతో బాలిక తండ్రికి విషయాన్ని తెలిపింది. యువకుడిని మందలించేందుకు వెళ్లిన బాలిక కుటుంబ సభ్యులపై సుధాకర్ తండ్రి చిన్ననరసప్ప, తల్లి ఈశ్వరమ్మ, కుటుంబీకులు పెద్దనరసప్పలు దాడికి పాల్పడ్డారు. దీంతో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు యువకుడు, అతని కుటుంబ సభ్యులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వివాహేతర సంబంధం అంటగట్టి...

● పెళ్లి చేసుకోవాలని బెదిరింపు

కృష్ణగిరి: తన కుమారుడికి మరో అమ్మాయితో వివాహేతర సంబంధం అంటగట్టి, ఆ అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని బెదిరించారంటూ మండల పరిధిలోని తొగర్చేడు గ్రామానికి చెందిన శకుంతలమ్మ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు అదే గ్రామానికి చెందిన ఆరుగురిపై, కల్లూరు మండలం లక్ష్మీపురానికి చెందిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి గురువారం విలేకరులకు తెలిపారు. గతేడాది జనవరి 12న రాత్రి తాను తన కుటుంబ సభ్యులతో ఇంట్లో ఉన్న సమయంలో నిందితులు ఇంట్లోకి ప్రవేశించి తమను దుర్భాషలాడుతూ, తమ అమ్మాయిని పెళ్లి చేసుకోవాల్సిందేనంటూ లేకపోతే చంపుతామంటూ బెదిరించారని శకుంతలమ్మ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు నిందితులు 10మందిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



పోటీలకు ఎంపికయిన జిల్లా లిఫ్టర్లు

కర్నూలు (టౌన్): రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులను ఎంపిక చేశారు. వీరిని గురువారం స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని వ్యాయామ హాలులో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన వారికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ కార్యదర్శి వేణుగోపాల్ ఎంపికైన లిఫ్టర్లను ప్రకటించారు. 61 కిలోల క్యాటగిరీలో ఇస్మాయిల్, రవి యువరాజ్, లక్ష్మీనరసింహ, మధుతేజ, 93 కిలోల క్యాటగిరీలో మహేష్‌రావు, 65 కిలోల క్యాటగిరీలో శంకర్, బాలికల 61 కిలోల విభాగంలో ధీరజ, రాధిక, జూనియర్స్ 54 కిలోల క్యాటగిరిలో వెంకటలక్ష్మి, పుష్ప, సీనియర్స్ 88 కిలోల విభాగంలో నాగమణి ఉన్నారని ఆయన వెల్లడించారు. ఎంపికైన వారు ఈనెల 29 నుంచి 31 వరకు గుంటూరు జిల్లా మంగళగిరిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

ఆ'శక్తి' తగ్గిపోయిందా!

- స్త్రీ పురుషుల్లో సంతానలేమి సమస్యలు
- తీవ్రమైన మానసిక ఒత్తిడే కారణం
- స్త్రీలలో ఊబకాయం, పీసీఓడీ సమస్యలు
- సంతానం కోసం వైద్యుల వద్ద క్యూ



కర్నూలు(హాస్పిటల్): ఆధునిక అలవాట్లు, తీరిక లేని ఉద్యోగాలు, తీవ్ర మానసిక ఒత్తిడి కారణంగా పురుషుల్లో శుక్రకణాల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. ఫలితంగా సంతానలేమి సమస్యల వారిని తీవ్రంగా వేధిస్తోంది. పెళ్లయి ఎంత కాలమైనా తమకు పిల్లలు కలగడం లేదని వైద్యుల వద్దకు వెళ్లే దంపతుల సంఖ్య ఇటీవల కాలంలో అధికమైంది. 50 ఏళ్ల క్రితం యువతలో శుక్రకణాల సంఖ్య పరీక్ష చేస్తే 50 మిలియన్లు ఉండేవి. కానీ ఇప్పుడు అవి 15 నుంచి 20 మిలియన్లకు పడిపోయాయి. యువతలో శుక్రకణాలు భారీ సంఖ్యలో తగ్గిపోతున్నాయని వైద్యులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికి రెండు తరాల ముందు వారు ఒక్కొక్కరు ఐదారుగురు పిల్లలను ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏడాదికి ఒకరు చొప్పున కనేవారు. కానీ ఇప్పుడు వివాహమై నాలుగేళ్లయినా సంతానానికి నోచుకోవడం లేదు. ఈ మేరకు వైద్యుల చుట్టూ తిరగడం, వారిచ్చిన మందులు మింగడంతోనే సరిపోతోంది. మారిన జీవనశైలి, వాతావరణ కాలుష్యం, ఆహారపు అలవాట్ల కారణంగానే ఈ పరిస్థితి నెలకొన్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఈ క్రమంలో జిల్లాలో వివాహమైన వారిలో 25 నుంచి 30 శాతం మంది దాకా సంతానలేమి సమస్యతో బాధపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. సంతానలేమి సమస్య ఒకప్పుడు 10 జంటల్లో ఒక జంటకు ఉంటే ఇప్పుడు ఆరు జంటల్లో ఒక జంటకు ఉంటోంది. సంతానలేమి సమస్యలున్న వారు పెరుగుతుండటంతో డిమాండ్‌కు అనుగుణంగా కర్నూలు నగరంలో ఫెర్టిలిటీ కేంద్రాలు(సంతాన సాఫల్య కేంద్రాలు) సంఖ్య పెరుగుతోంది.

జీవనశైలి మారడంతో ఇబ్బందులు

మారుతున్న జీవనశైలి, పాశ్చాత్య పోకడల కారణంగా భారతీయుల్లోనూ సంతానలేమి సమస్యలు అధికమవుతున్నాయి. ఒకప్పుడు జన్యుపరంగా, వంశపారంపర్యంగా సంతానలేమి సమస్యలుండేవి. అది కూడా వెయ్యిలో ఒకరో ఇద్దరో ఇలాంటి ఇబ్బందులతో బాధపడేవారు. కానీ ప్రస్తుతం ప్రతి ఆరుగురు జంటల్లో ఒక జంటను ఈ సమస్య వేధిస్తోంది. ముఖ్యంగా మారిన జీవనశైలి కారణంగా ఆహారపు అలవాట్లు క్రమేపీ మారాయి. సంప్రదాయ ఆహారం స్థానంలో జంక్‌ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్‌ను ఇష్టపడుతున్నారు. అందులో వేసే చైనా సాల్ట్, పలు రకాల నిషేధిత రంగులు, వాడిన నూనెను పలుమార్లు వాడటం, ఫ్రిడ్జ్‌లో నిల్వ చేసిన ఆహార పదార్థాలను మళ్లీ వేడి చేసుకుని తినడం వంటి కారణాల వల్ల సంతానలేమి సమస్యలు వస్తున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జంక్‌ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్‌ను అధికంగా తీసుకోవడం, రాత్రిళ్లు ఎక్కువసేపు మేల్కొనడం, సరైన నిద్రలేకపోవడం, తీవ్ర మానసిక ఒత్తిడి తదితర కారణాలు సంతానలేమి సమస్యకు కారణాలుగా వారు పేర్కొంటున్నారు.

యువతులకు అదో పెద్ద సమస్య

యువతుల్లో సంతానలేమి సమస్యకు ప్రధాన కారణంగా పీసీవోడీ అని వైద్యులు చెబుతున్నారు. ఈ సమస్య కారణంగా గర్భాశయంలో నీటిబుడగలు(పీసీవోడీ) ఏర్పడటం వల్ల సంతానలేమికి పెద్ద అడ్డంకిగా మారుతోంది. మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా కొందరు చిన్న వయస్సులోనే రజస్వల అవుతుండగా మరికొందరు పదహారేళ్లు దాటినా రజస్వల కాని పరిస్థితి నెలకొంది. పీసీవోడీ కారణంగా నెలసరి రావడంలో ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. నెలనెలా నెలసరి కాకపోవడంతో పాటు నెలసరి వచ్చిన సమయంలో తీవ్ర రక్తస్రావం కూడా జరుగుతూ యువతులను ఇబ్బంది పెడుతోంది. మరికొందరికి గర్భాశయంలో సమస్యలు, లోపాలు ఉంటున్నాయి. ఇందులో ప్రధానంగా అండం పెరుగుదల, అండం విడుదల సక్రమంగా లేకపోవడం, అది ప్రయాణించే మార్గం మూసుకుపోవడం, గర్భాశయ గోడలు పిండం ఎదుగుదలకు అనువుగా లేకపోవడం, గర్భాశయ ముఖద్వారం వీర్యకణాలు లోనికి వెళ్లేందుకు అనువుగా లేకపోవడం వంటి కారణాలు ఉన్నాయి.

పురుషుల్లోనూ సమస్యలు ఎక్కువే!

ఒకప్పుడు సంతానం కలగలేదంటే కేవలం స్త్రీల వైపు మాత్రమే దృష్టి సారించేవారు. ఎక్కడికి వెళ్లినా ఆమెకే వేధింపులు ఎదురయ్యేవి. మూడు, నాలుగు తరాల క్రితం పిల్లలు కలగడం లేదని ఆత్మహత్య చేసుకున్న మహిళలు కూడా ఉన్నారు. కానీ ప్రస్తుతం పరిస్థితి మారింది. ఆధునిక వైద్యం కారణంగా స్త్రీ, పురుషులిద్దరికీ పరీక్షలు చేసే వీలు కలిగింది. దీంతో ఎవరిలో లోపం ఉందో ఇట్టే తెలిసిపోతోంది. ఇటీవల కాలంలో పురుషుల్లోనూ వీర్యకణాల సంఖ్య తక్కువగా ఉంటున్నాయి. ఇవి పూర్తి స్థాయిలో లేకపోవడం వల్ల సంతానలేమి సమస్య ఉత్పన్నమౌతోందని వైద్యులు చెబుతున్నారు. వీర్యకణాలు తగ్గడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులు, వృషణాల క్యాన్సర్‌కు దారి తీయడంతో పాటు ఆయువు కూడా తగ్గుతుందని వారు హెచ్చరిస్తున్నారు. దీంతో పాటు వీర్యకణాల కదలిక, సారూప్యంలో అధికంగా తేడాలుండటం, వీర్యకణాలు ప్రయాణించే నాళాలు మూసుకుపోవడం, హార్మోన్ల శాతంలో అసమతుల్యత, ధూమపానం, మద్యపానం, డ్రగ్స్‌కు అలవాటు పడి ఉండటం, జంక్‌ఫుడ్ ఎక్కువగా తినడం, నిద్రలేకుండా పనిచేయడం, జన్యుపరమైన లోపాలు, ఎక్కువసేపు కూర్చుని పనిచేయడం వల్ల స్థూలకాయం, ల్యాప్‌టాప్ ఒళ్లో పెట్టుకుని పనిచేయడం వల్ల అధిక వేడి ఉత్పన్నమై సంతానలేమి సమస్యకు దారి తీస్తోందని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ సమస్య ఎక్కువగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లోనూ కనిపిస్తోందని వారు చెబుతున్నారు.

నివారణకు ఇలా చేయాలి

- వీలైనంత వరకు సంప్రదాయ దుస్తులు ధరించాలి.
- ఇంట్లో వండిన సంప్రదాయ పిండి వంటలు, ఆహార పదార్థాలను తినాలి.
- జంక్‌ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి.
- గంటల తరబడి ల్యాప్‌టాప్‌ను ఒళ్లో పెట్టుకుని పనిచేయకూడదు.
- బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి సమస్యలు ఉంటే నియంత్రణలో ఉంచుకోవాలి.
- ప్రతిరోజూ సమతుల ఆహారం తీసుకోవాలి.
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.

పురుషుల్లో శుక్రకణాల సంఖ్య తగ్గిపోతోంది



సంతానలేమి సమస్య కేవలం స్త్రీలకే కాదు పురుషుల్లోనూ ఉంది. ఈ సమస్యతో బాధపడుతూ మా వద్ద చికిత్సకోసం వచ్చే వారి సంఖ్య ఇటీవల పెరిగింది. పెళ్లయి ఏడాది దాటినా సంతానం కలగలేదంటే భార్యాభర్తలిద్దరూ వైద్యుల వద్దకు వెళ్లి పరీక్ష చేయించుకోవాలి. పురుషునికి వెరికోసి ఏమైనా ఉంటే ఆపరేషన్ చేయించుకుంటే సమస్య తీరుతుంది. భార్యాభర్తలిద్దరూ వేర్వేరు ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తూ నెలలో ఒకటి, రెండు సార్లు కలవడం వల్ల కూడా ఈ సమస్య వస్తోంది. జీన్స్ ప్యాంట్ టైట్‌గా వేసుకోవడం వల్ల వృషణాలు ఒత్తిడికి లోనై శుక్రకణాలు తగ్గిపోతున్నాయి.

– డాక్టర్ కేజీ. గోవిందరెడ్డి, యురాలజిస్టు, కర్నూలు

అండాశయంలో గుడ్ల సంఖ్య తగ్గిపోతోంది



గతంలో మా వద్దకు వచ్చే పది జంటల్లో ఒకరికి సంతానలేమి సమస్య ఉండేది. కానీ ఇప్పుడు ఆరు జంటల్లో ఒకరికి ఉంటోంది. కెరీర్‌పై దృష్టి సారించి వివాహం ఆలస్యంగా చేసుకోవడం, వివాహం చేసుకున్నా సంతానం కలగడాన్ని వాయిదా వేసుకోవ దం వల్ల అండంలో నాణ్యత తగ్గిపోతుంది. సాధారణంగా 30 ఏళ్ల తర్వాత అండాశయంలో గుడ్ల నాణ్యత, సంఖ్య తగ్గుతుంది. మారుతున్న జీవనశైలి, వ్యాయామం లేకపోవడం, ఆహారపు అలవాట్ల వల్ల స్థూలకాయం పెరగడం వల్ల అండాల్లో కొవ్వు శాతం ఎక్కువై నాణ్యత దెబ్బతింటోంది. దీనికితోడు హార్మోన్ల అసమతుల్యత కారణంగా నెలసరి సరిగ్గా రాకపోవడం వల్ల సంతానలేమి సమస్య వస్తోంది. వివాహమై ఏడాదైనా పిల్లలు కలుగలేదంటే వైద్యులను కలిసి చికిత్స తీసుకోవాలి.

–డాక్టర్ విజయలక్ష్మి దాసరి,గైనకాలజిస్టు, కర్నూలు

తమ్ముడిని చంపిన అన్న

● కల్లందొడ్డి విషయంలో ఘర్షణ



మృతిచెందిన వెంకట్రాముడు

కోడుమూరు రూరల్: ఆస్తి విషయంలో వివాదం చెలరేగి సొంత తమ్ముడినే అన్న హత్య చేశాడు. ఈ ఘటన కోడుమూరు మండలంలోని అనుగొండ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అన్నదమ్ములైన బోయ భాస్కర్, బోయ వెంకట్రాముడు(30) గతంలోనే ఆస్తులను పంపకాలు చేసుకుని అనుభవిస్తున్నారు. అయితే కల్లందొడ్డి పంపకం విషయంలో బుధవారం రాత్రి వారిద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో అన్న భాస్కర్ తమ్ముడు వెంకట్రాముడును ఎద్దుల బండికుండే ఇనుప మేడితోక తీసుకుని తలపై బలంగా కొట్టాడు. తీవ్ర గాయాలతో వెంకట్రాముడు అక్కడికక్కడే మృతిచెందాడు. కోడుమూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వెంకట్రాముడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గురువారం కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య శోభతో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బోయ భాస్కర్ పరారీలో ఉన్నట్లు ఎస్ఐ బాలనరసింహులు తెలిపారు.

ఎస్ఐ అంటూ వీరంగం

- జిరాక్స్ నిర్వాహకుడిపై దాడి
- పోలీసుల అదుపులో ఇద్దరు



పోలీసుల అదుపులో రామకృష్ణ (ఆకుపచ్చ టీ షర్ట్ వేసుకున్న వ్యక్తి)

బొమ్మలసత్రం: తనకు తాను ఎస్ఐగా చెప్పుకుంటూ ఓ వ్యక్తి ఓ జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడిపై దాడి చేసి వీరంగం సృష్టించిన ఘటన గురువారం నంద్యాల పట్టణంలో చోటుచేసుకుంది. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉదయ్ అనే యువకుడు జిరాక్స్ సెంటర్‌ను నడుపుతున్నాడు. గురువారం ఉదయం ఇద్దరు వ్యక్తులు వచ్చి జిరాక్స్ చేయాలని, కాపీకి రూపాయి ఇస్తామన్నారు. అంత తక్కువకు తనకు గిట్టుబాటుకాదని ఉదయ్ వారికి తెలిపాడు. దీంతో వారిలో రామకృష్ణ అనే వ్యక్తి 'నేను ఎస్ఐని.. నాకే ఎదురు చెప్తావా' అంటూ దుర్భాషలాడుతూ యువకుడిపై దౌర్జన్యానికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు టూ టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని రామకృష్ణను ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు చెప్పడంతో ఇద్దరిని అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. రామకృష్ణ గతంలో ఓ ప్రభుత్వ రంగ సంస్థలో సెక్యూరిటీగా పనిచేసేవాడని, అక్కడ విధుల నుంచి తొలగించడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ తనని తాను ఎస్ఐగా చెప్పుకుంటూ, అనుచరులను ఏర్పాటు చేసుకుని దందాలు చేస్తున్నాడని పోలీసుల విచారణలో తేలింది. బాధిత యువకుడి ఫిర్యాదు మేరకు ఇద్దరి నిందితులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రెండు టిప్పర్లు సీజ్

కర్నూలు (న్యూటౌన్): అనుమతులు లేకుండా కల్లూరు మండలం తడకనపల్లె నుంచి అక్రమంగా మెటల్, గ్రావెల్ తరలిస్తున్న రెండు టిప్పర్లను గురువారం సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. వాటిని ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌లో ఉంచి, రూ.35 వేలు జరిమానా వసూలు చేశామన్నారు. అలాగే కె. నాగలాపురం నుంచి అక్రమంగా నాపరాయి తరలిస్తున్న లారీని పట్టుకుని రూ.40 వేలు జరిమానా విధించామన్నారు.

దర్గాలో పక్కీర్ల విన్యాసాలు



ఘనంగా జియారత్ వేడుకలు

కౌతాళం: జగద్గురు ఖాదర్‌లింగ స్వామి ఉరుసులో భాగంగా గురువారం జియారత్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం దర్గాలో ధర్మకర్త సయ్యద్ మున్నపాషా వుసేని చిష్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు చేశారు. ధర్మకర్త ఇంటి నుంచి వచ్చిన గంధంను స్వామి సమాధికి పూశారు. అనంతరం స్థానికంగా ఉన్న పక్కీర్లతో ప్రత్యేక ఖవ్వాలి పోటీలను నిర్వహించారు. పక్కీర్ల విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం బ్యాండు మేళాలు, డప్పు వాయిద్యాల మధ్య వారిని కట్టా వద్దకు ఊరేగింపు తీసుకుని వెళ్లి వదిలి వచ్చారు. సలాముల ఆలపన చేశారు. వేడుకల్లో పలువురు పాల్గొన్నారు.



స్వామి సమాధికి గంధం పూస్తున్న దృశ్యం

సారా స్థావరాలపై సెబ్ దాడులు

కర్నూలు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సారా రవాణా, తయారీ, విక్రయాలపై సెబ్ ప్రత్యేక దృష్టి సారించింది. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ ఆదేశాల మేరకు గురువారం సెబ్ బృందాలు జిల్లా వ్యాప్తంగా విస్తృత దాడులు నిర్వహించారు. కర్నూలు, ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల పరిధిలోని సారా స్థావరాల్లో దాడులు నిర్వహించి బట్టీలను ధ్వంసం చేసి సారా తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. కర్నూలు స్క్వాడ్ ఎస్ఐ వీరస్వామి, కోడుమూరు సెబ్ సీఐ రామాంజనేయులు ఆధ్వర్యంలో జరిపిన దాడులలో వెల్దుర్తి మండలం ఎల్‌బండ తండాకు చెందిన స్వామినాయక్, రామళ్లకోటకు చెందిన మద్దిలేటి స్వామిని అదుపులోకి తీసుకుని 25 లీటర్ల నాటుసారాతో పాటు టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్‌ను సీజ్ చేశారు. 480 లీటర్ల నాటుసారా తయారీకి సిద్ధం చేసిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. మొత్తం మూడు కేసులు నమోదు చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు సెబ్ అధికారులు తెలిపారు. సెబ్ సిబ్బంది హనుమంతు, శంకర్‌నాయక్, గోపాల్ నాయక్, వెంకటరాముడు, బషీర్ బాషా, కర్నా తదితరులు దాడుల్లో పాల్గొన్నారు.



మోపెడ్‌పై తరలిస్తున్న సారాను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

దుప్పిపై కుక్కల దాడి

● రక్షించిన అటవీ అధికారులు

ఆత్మకూరురూరల్: అరణ్యంలో స్వేచ్ఛగా సంచరించే చుక్కల దుప్పి దారితప్పి జనారణ్యంలోకి వచ్చి ప్రమాదం బారిన పడింది. ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని ముష్టపల్లె గ్రామ శివార్లలోని పంట పొలాల్లోకి గురువారం దారి తప్పిన ఒక పాడ దుప్పి వచ్చింది. ఊర కుక్కలు వెంట పడడంతో ఆ దుప్పి ప్రాణ భయంతో గ్రామంలోకి పరుగులు తీసింది. అప్పటికే కుక్కలు దుప్పి వెనుక భాగంలో గాయపరిచాయి. పారిపోతున్న దుప్పి గ్రామంలోని ఒక బాత్ రూంలోకి జొరబడింది. దీన్ని గమనించిన గ్రామస్తులు బాత్ రూం తలుపు వేసి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. గ్రామానికి చేరుకున్న అటవీ అధికారులు వన్యప్రాణి వైద్యనిపుణులు అయిన జుబేర్ ఆధ్వర్యంలో సంరక్షణ చర్యలు చేపట్టారు. బైర్లూటిలోని వన్యప్రాణి డిస్పెన్సరీకి తరలించి చికిత్స అందించారు. పరిశీలనలో ఉంచి అడవిలో వదిలేస్తామన్నారు.



గాయపడిన దుప్పి

ఆదోనిలో ఐపీ పెట్టిన వ్యాపారి!

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఓ వ్యాపారి రూ.50 లక్షలు ఐపీ పెట్టినట్లు సమాచారం. గత రెండు నెలలుగా ఆయన చుట్టూ కమీషన్ ఏజెంట్లు డబ్బు కోసం తిరుగుతుండడంతో మహారాష్ట్రలో తనకు పేమెంట్ రావాల్సి ఉందని, త్వరలో వస్తుందని, వచ్చిన వెంటనే ఇస్తామంటూ చెబుతూ వచ్చారు. తీరా గురువారం ఆ వ్యాపారి యార్డులోని 9 మంది కమీషన్ ఏజెంట్లకు ఐపీ నోటీసులు పంపినట్లు సమాచారం. రూ.50 లక్షలకు 9 మందికి నోటీసులు జారీ అయినట్లు తెలిసింది.

నాణ్యత లేకపోతే విత్తన సంస్థలపై చర్యలు

● వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్లను తనిఖీ చేసిన డీఏవో



మొలక శాతాన్ని పరిశీలిస్తున్న డీఏవో వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): వేరుశనగలో నిర్దేశించిన మేర నాణ్యత ప్రమాణాలు లేకపోతే సంబంధింత విత్తన సంస్థలపై చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో) పీఎల్ వరలక్ష్మి హెచ్చరించారు. సబ్సిడీపై పంపిణీ చేసేందుకు ఉద్దేశించిన వేరుశనగ ప్రాసెసింగ్ ప్రక్రియను గురువారం ఆమె తనిఖీ చేశారు. వేరుశనగ విత్తనం కాయల నాణ్యతను, మొలక శాతాన్ని కూడా పరిశీలించారు. వేరుశనగ విత్తనం కాయలను రాయితీపై పంపిణీ చేసేందుకు వ్యవసాయ శాఖ ఏపీసీడ్స్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఏపీ సీడ్స్ తెలంగాణలోని మహంకాలేశ్వర అగ్రిటెక్, కర్నూలు జిల్లాలోని శ్రీచక్రసీడ్స్, శ్రీకృష్ణసీడ్స్, శివసాయి సీడ్స్ కంపెనీల్లో వేరుశనగ ప్రాసెసింగ్ ప్రక్రియను కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, కల్లూరు ఏవో శ్రీనివాసరెడ్డిలతో కలసి డీఏవో తనిఖీలు నిర్వహించారు. వేరుశనగలో నాణ్యత 100 శాతం ఉండాలని ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ ధనలక్ష్మిని ఆదేశించారు. కేటాయించిన మేరకు ఆర్‌బీకేల వారిగా వేరుశనగను సిద్ధం చేయాలని సూచించారు. సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఉండి నాణ్యతలోపం లేకుండా అనుక్షణం పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. జిల్లాకు 13,969 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించగా... ఇప్పటి వరకు 3,500 క్వింటాళ్ల వేరుశనగను ఆర్‌బీకేలకు తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆళ్లగడ్డ: పట్టణ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన ప్రేమ్‌కుమార్ (25) మాజీ మంత్రి భూమా అఖిలప్రియ కారు డ్రైవర్‌గా ఉన్నాడు. బుధవారం అర్ధరాత్రి పట్టణ శివారులోని ఓ హోటల్‌లో భోజనం చేసి తిరిగి బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో మహాలక్ష్మి ఫంక్షన్ హాలు సమీపంలో అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ప్రేమ్‌కుమార్‌ను స్థానిక వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.